క్లుప్తంగా

మిషన్ శక్తిపై అవగాహన కార్యక్రమం



వినుకొండ(నూజెండ్ల): మిషన్ శక్తి భారతీయ న్యాయసహిత అవగాహన కార్యక్రమంలో భాగంగా వినుకొండ పట్టణంలోని ఎస్ఎస్పీ కాలనీలో గల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఆరె సామ్రాజ్యం మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు వివాహం జరిపించడం చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, ఆహారంపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు కె.విజయకుమారి, సీహెచ్. సుధారాణి, జి.నాగజ్యోతి, ఎ.రేవతి, పి.వి.గాయత్రి, కె.సోని పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలోని ప్రధాన కూడలి మార్గం గ్రంథాలయం సెంటరులో డాక్టరు రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ కంటి వైద్యశాల వారి సారథ్యంలో ఉచితంగా కంటి వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. ఈకంటి వైద్యశిబిరంలో వైద్య సేవలు పొందే వారందరూ ఆరోగ్యశ్రీ కార్డు, హెల్త్ కార్డు, ఆధార్, రైస్‌కార్డు, తదితర ఆధారాలు అందజేసి తమ పేర్లను శిబిరంలో నమోదు చేసుకున్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 206 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో కంటి శుక్లముల ఆపరేషన్లు చేయించుకునే వారు 58 మందిని గుర్తించారు. 72 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ఈశిబిరంలో గ్రామపెద్దలు యరమాసు కోటేశ్వరరావు, కోట హరిబాబు వైద్యులు పాల్గొన్నారు.

లక్కీడ్రాలో విజేతగా నిలిచిన రైతుకు బహుమతి



నరసరావుపేట రూరల్: ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సంబరాల విజేతకు 50 గ్రాముల వెండిని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ అందజేశారు. 2013–24 రబీ సీజన్‌లో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ నిర్వహించిన రైతు సంబరాలలో ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు లక్కీ డ్రా నిర్వహించారు. బొల్లాపల్లి మండలం గుట్టపల్లి గ్రామానికి చెందిన గంగసాని గురవారెడ్డి డ్రాలో విజేతగా నిలిచారు. ఆయనకు డీఏవో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఆర్‌జె కృష్ణారావు, కోరమండల్ సీనియర్ మేనేజర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు ఆర్థిక సహాయం



చిలకలూరిపేట: ఇన్నర్‌వీల్ సంస్థ మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో నిరుపేద మహిళ పొట్లూరి మరియమ్మకు ఇంటి నిర్మాణం కోసం రూ. 25 వేలు ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ ఆర్థిక సహాయాన్ని క్లబ్ సభ్యురాలు గోగినేని రత్నకుమారి అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, సభ్యులు దండా రమాదేవి, పోతినేని పద్మావతి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీవద్దు

మాచర్ల రూరల్: విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించటంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో కె.సరోజనీదేవి కోరారు. బుధవారం మండల పరిధిలోని కంభంపాడు జెడ్పీ హెచ్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. పేద,బడుగు, బలహీనవర్గాల చిన్నారులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం మేలైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తుందని, ఈ ఆహారాన్ని సమయపాలన ప్రకారం ఎటువంటి లోటు లేకుండా అందించాలన్నారు.

మురుగుకాలువ సమస్య పరిష్కరించండి

సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



వార్డులో సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు వివరిస్తున్న స్థానికులు

నరసరావుపేట: వర్షపు నీరు మురికి కాల్వలో నిలిచి పోవడంపై స్థానిక 31 వార్డు ప్రజలు చేసిన ఫిర్యాదుపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం రాత్రి స్పందించారు. మురుగు కాల్వలో నీరు పారడంలేదని, ఇళ్లలోకి చేరే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో కలెక్టర్ సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే నేరుగా మున్సిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. తక్షణమే మురుగు కాల్వల్లో పూడిక తొలగించి సమస్య పరిష్కరించాల్సిందిగా కమిషనరును కోరారు. వర్షాకాలం నేపథ్యంలో ఇలాంటి సమస్య మళ్లీ తలెత్తకుండా ముందే పూడిక తీసివేతలు ప్రారంభించాలన్నారు. మరోసారి ఫిర్యాదు వచ్చే అవకావం లేకుండా చూడాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ కోరారు. బుధవారం ఆయన సచివాలయంలో సీఎంను కలిసి కోరినట్లు ఎమ్మెల్యే ప్రతినిధులు తెలిపారు. అభివృద్ధిలో నియోజకవర్గాన్ని అగ్రభాగంలో నిలిపేందుకు తాను పాటుపడుతున్నట్లుగా సీఎంకు చెప్పారు. అనంతరం మంత్రులు డోలా వీరాంజనేయులు, నిమ్మల రామానాయుడిని కలిసి సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని కోరానన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్ కుమార్

రొంపిచర్ల : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్ కుమార్ అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం, బుచ్చిపాపన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ జి.ఓ. నెం. 117ను రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వం అమలు పరిచిన జి.ఓ. నెం. 117 వలన ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వలన ఆంధ్రప్రదేశ్‌లో ఆఘమేఘాల మీద అమలు చేయడం విద్యావ్యవస్థకు నష్టం కలుగుతుందన్నారు. నూతన ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ పటిష్టతను బలోపేతం చేయాలన్నారు. అనంతరం మండలంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వం నమోదుచేసి, సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కార్మెల్ మేరీ, మల్లికా బేగం, మండల నాయకులు రామాంజనేయులు, రమేష్, అనూష, నెహ్రూ, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో యూటీఎఫ్ నాయకులు

అంటువ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

వైద్యాధికారి రాధాకృష్ణన్



మాట్లాడుతున్న వైద్యాధికారి రాధాకృష్ణన్

శావల్యాపురం: వర్షాకాలంలో ప్రబలే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో డయేరియా, జ్వరాల బారిన ప్రజలు పడకుండా ఉండటానికి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో డయేరియా, జ్వర బాధితులను ఉంటే సత్వరమే ఆరోగ్య కేంద్రంలో సమాచారం అందించి ప్రాథమిక దశలో నియంత్రణ చేయాలన్నారు. అలాగే నెలవారీ టీకాలు పారదర్శకంగా జరిగేలా వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా సమగ్ర వివరాలు ఆరోగ్య సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. విధుల్లో అలసత్వం వహించిన ఆరోగ్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్య సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కౌలు వేలం

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో వేంచేసి ఉన్న శ్రీ వీరేశ్వర స్వామి వారి దేవస్థానానికి సంబంధించిన భూములకు దేవదాయ ధర్మాదాయ చట్టం ప్రకారం ఈ నెల 11వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు స్వామి వారి దేవాలయ ఆవరణలో కౌలు వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వహణాధికారి తెలిపారు. 2024–27 వరకు కౌలు హక్కు పొందేందుకు వేలం జరుగుతుందని, పాల్గొనేవారు ముందుగా డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ చట్టం ప్రకారం వేలం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలివే

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్, ఫైర్ స్టేషన్ రోడ్డు, వాసవీ నగర్, చౌత్రా సెంటర్, వినాయకుడి గుడి రోడ్డు, ఆర్యవైశ్య కల్యాణమండపం, మద్ది మల్లయ్యవీధి, కృష్ణమహల్ సెంటర్ పరిసర ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మాచర్ల: తెల్లవారు జామున పట్టణ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మరణించిన ఘటన పట్టణ పరిధిలోని చెన్నకేశవ నగర్ కాలనీ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య తెలిపిన కథనం ప్రకారం మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన దొంతగాని శ్రీనివాసరావు గౌడ్ (45) తెల్లవారుజామున 4 గంటల సమయంలో మాచర్ల పట్టణంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వాహనాలు నడిపే వారు నిబంధనలు పాటించాలి



మాచర్ల: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషరెడ్డి కోరారు. బుధవారం ప్రమాద నివారణ రహిత అవగాహన కార్యక్రమంలో భాగంగా పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు ఎడమ వైపు వాహనాలను నడపాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా.. అతి వేగంగా వాహనాలు నడప రాదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వాహనదారులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



బోనస్ పంపిణీ చేస్తున్న మేనేజర్ వీరేంద్రకుమార్

రొంపిచర్ల: స్థానిక దాసరిపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో బుధవారం సంగం డెయిరీ ఆధ్వర్యంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి పాల ఉత్పత్తిదారులకు బోనస్, ధరల వ్యత్యాసం కింద నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగం డెయిరీ నరసరావుపేట పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ వీరేంద్రకుమార్ మాట్లాడుతూ సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. సంగం డెయిరీ అందిస్తున్న సేవలను పాల ఉత్పత్తిదారులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం పరిధిలో గల మొత్తం 79 మంది పాల ఉత్పత్తిదారులకు ధరల వ్యత్యాసం క్రింద రూ.2,67,905 రూపాయలు, బోనస్ క్రింద రూ.3,42,473 రూపాయల నగదు కలిపి మొత్తం రూ.6,10,378 రూపాయల నగదు పంపిణీ చేశారు. రూ.100 రూపాయలకు రూ.9.50 రూపాయల చొప్పున పంపిణీ చేశారు. అదే విధంగా వీరిలో అత్యధికంగా పాలు పోసిన వారిలో మొదటి బహుమతి క్రింద గోపు కృష్ణకుమారికి రూ.2,000 రూపాయలు, ద్వితీయ బహుమతి క్రింద నెల్లూరి అనసూర్యమ్మకు రూ.1700 రూపాయలు, తృతీయ బహుమతి క్రింద పోపూరి స్వరాజ్యం కు రూ.1300 రూపాయలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ రూట్ సూపర్ వైజర్ కృష్ణారెడ్డి, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు మన్నం లక్ష్మీ నరసింహారావు, సెక్రటరీ సాగి రామారావు, టెస్టర్ జె.వి.కోటయ్య, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణతో ఉపయోగాలు

జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ సత్యగోపాల్



మట్టి నమూనాలు సేకరిస్తున్న విద్యార్థులతో వ్యవసాయ శాఖ అధికారులు

చిలకలూరిపేట: మట్టి నమూనా సేకరణ పరీక్షల ద్వారా పంట దిగుబడుల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ సత్యగోపాల్ చెప్పారు. మండలంలోని మద్దిరాల గ్రామం జవహర్ నవోదయ విద్యార్థులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సాయిల్ హెల్త్, మట్టి నమూనాపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. విద్యార్థులతో మట్టి నమూనాలు సేకరింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిల్ హెల్త్ పరీక్షల ద్వారా ఏఏ పంటలు వేసి అధిక దిగుబడులు సాధించవచ్చో తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మస్తానమ్మ, ఏవో సాయిల్ టెస్టింగ్ జి.వరలక్ష్మి, ఏటీఎంఏ ఏవో రాజవంశీ, మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత, ఏఈవోపీ శ్రీనివాసరావు, విద్యాలయ ప్రిన్సిపాల్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు పాఠశాలల్లో చదువుకోవాలి

సమగ్ర శిక్షా స్టేట్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డి మల్లికార్జున్



నాదెండ్ల మండల విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించిన మల్లికార్జున్

నాదెండ్ల: బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో చేరి విద్యాభ్యాసం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని సమగ్ర శిక్షా స్టేట్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డి.మల్లికార్జున్ చెప్పారు. నాదెండ్ల మండల విద్యావనరుల కేంద్రాన్ని బుధవారం ఆయనతో పాటూ బృందం సభ్యులు విచ్చేశారు. ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులతో నేను బడికి పోతా కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 12 నుంచి జూలై 13 వరకూ ప్రతి గ్రామంలో ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 25 వరకూ పాఠశాలల్లో బడి బయట పిల్లలను చేర్చుకోవచ్చన్నారు. నాదెండ్ల మండల పరిధిలో ఇప్పటి వరకూ 1వ తరగతిలో 320 మంది, ఆరో తరగతిలో 500 మందికి పైగా విద్యార్థులు చేరినట్లు ఎంఈవో కృష్ణారెడ్డి వివరించారు. చిన్నారులను పనిలో పెట్టుకున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటూ పల్నాడు జిల్లా ఏఎల్ఎస్ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఐఈడీ కోఆర్డినేటర్ సెల్వరాజు, ఉన్నారు.

డంపింగ్ యార్డు తొలగించాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: పట్టణ ప్రవేశ రహదారి ఎస్ఆర్‌కేటి కాలనీ వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే తొలగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని బుధవారం సీపీఐ నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి వచ్చే దుర్గంధం భరించలేక సమీప ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందుకు గురవుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులకు గతంలో ఎన్నోమార్లు డంపింగ్ యార్డు వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి తొలగించాలని అర్జీలు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. డంపింగ్ యార్డుపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్పందించి అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, షేక్.చినజాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

అనధికార విద్యుత్ వినియోగానికి పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ విజయకుమార్

చిలకలూరిపేట: అనధికార విద్యుత్ వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ ఎస్ఈ పి.విజయకుమార్ హెచ్చరించారు. విద్యుత్ ఎస్ఈ విజయకుమార్ నేతృత్వంలో గుంటూరు–2 ఈఈ సీహెచ్ రమేష్, విజిలెన్స్ ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో 31 బృందాలుగా చిలకలూరిపేట పట్టణంలో విద్యుత్ దాడులను బుధవారం నిర్వహించారు. ఈ దాడుల్లో అనధికారికంగా విద్యుత్ అధికలోడ్ వినియోగిస్తున్న 82 సర్వీసులను గుర్తించి వారికి రూ. 3,75,000 అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా విద్యుత్ డీఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయకుమార్ మాట్లాడుతూ ఇకపై క్రమం తప్పకుండా దాడులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో చిలకలూరిపేట విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్, ఇతర డీఈఈలు ఎ.గురునాధరావు, పీవీఆర్ మల్లిఖార్జునరావు, 11 మంది ఏఈఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

గురజాల: ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక నవోదయ డిగ్రీ కళాశాలలో బుధవారం రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని ప్రమాదం జరిగినా తలకు దెబ్బ తగలకుండా మృత్యువు నుంచి బయట పడవచ్చన్నారు. అదే విధంగా కారు నడిపే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, షేక్ జానీబాషా, ఎస్ఐ సౌందరరాజన్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలి

ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్‌రావు

రెంటచింతల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంపై చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలంలో కచ్చితంగా 200 ఎకరాలలో పండ్ల తోటలను చిన్న, సన్నకారు రైతులు సాగు చేసేలా క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. పండ్ల తోటలు సాగుచేసే రైతులు 5 ఎకరాలలోపు పంట పొలం, ఉపాధి హామీ జాబు కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ పథకం కింద మామిడి, జామ, బత్తాయి, నారింజ, సపోట, దానిమ్మ, సీతాఫలం, నిమ్మ, జీడిమామిడి తదితర 19 రకాల పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. ప్రతి రోజు మండలంలోని 11 గ్రామాలలో సుమారు 13 వేల మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, ఏపీవో జయ చంద్ర కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు చూపిన మార్గంలో ప్రజలను నడిపించాలి

పాస్టర్ సత్యం



విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న పాస్టర్ సత్యం

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలో దైవవాక్కు (ప్రార్థన) ప్రచారం చేసే పాస్టర్లు ప్రజలను ఏసు క్రీస్తు చూపిన సన్మార్గంలో నడిపించాలని పాస్టర్ ఎస్.సత్యం అన్నారు. బుధవారం స్థానిక అంకమ్మనగర్ కాలనీలోని ఏసుక్రీస్తు ప్రార్థన మందిరం 7వ వార్షికోత్సవం సందర్భంగా 50 మంది పాస్టర్లతో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కూడికలో ఆయన మాట్లాడారు.

ప్రపంచ మానవాళిని పాపముల నుంచి రక్షించుటకై సిలువ మరణం పొందిన దేవుని కుమారుడైన ఏసును ఆరాధించి ఆయన అడుగుజాడలలో నడవాలని కోరారు. ఏసుక్రీస్తు సూక్తులు ఆచరిస్తూ సమాజంలో ప్రజల పట్ల ప్రేమ, కరుణ, జాలి, దయ కలిగి శాంతియుతంగా జీవించాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పల్లెర్ల లక్ష్మారెడ్డిని ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మాజీ ఎంపీటీసీ వై.రమేష్, ఆదూరి శివ, వై.శ్రీనివాసరావు, కె.సైదులు, ఎన్.నర్సింహారావు, లేళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో బీకాం జనరల్ కొనసాగించాలి



పిడుగురాళ్ల: ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో బీకాం జనరల్ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిగ్రీ కోర్సుల్లో ప్రభుత్వ కళాశాలల్లో బీకాం జనరల్‌ను 42 కాలేజీలకు మాత్రమే పరిమితం చేసిందని, కానీ ప్రైవేటు కాలేజీల్లో బీకాం జనరల్ కొనసాగుతుందని, పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకోలేకపోతున్నారని వెంటనే బీకాం జనరల్ ప్రభుత్వ కళాశాలల్లో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ అధ్యక్షులు సాయి, ఉమర్, రాజా, రాహుల్ తదితరులు ఉన్నారు.